క్లుప్తంగా

నేడు పార్టీ కార్యాలయంలో బుర్రా

కందుకూరు: మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ సోమవారం పామూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండనున్నారు. ఎన్నికల అనంతరం వ్యక్తిగత పనులపై బెంగుళూరు వెళ్లిన ఆయన, మూడు రోజుల క్రితం తల్లి లక్ష్మమ్మ మృతి చెందడంతో స్వగ్రామం శివపురంలో ఆ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రమైన కందుకూరు రానున్న బుర్రా పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండనున్నారు.

జీవాలకు వ్యాక్సినేషన్ చేయించాలి

వెలిగండ్ల: తొలకరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీవాలకు జబ్బులు రాకుండా ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయించాలని పశువైద్యాధికారి హనుమాన్‌సాహెబ్ తెలిపారు. జీవాలకు దొమ్మ జబ్బు, నేల మురకకు వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. మండలంలో మొత్తం 60 వేల జీవాలు ఉన్నాయి. 15 వేల జీవాలకు నేల మురక జబ్బుకు, 3 వేల జీవాలకు దొమ్మ జబ్బుకు వ్యాక్సినేషన్ చేశామన్నారు. మిగిలిన వాటికి కూడా వ్యాక్సినేషన్ చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి హనుమాన్ సాహెబ్ తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



చాకిచర్లలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని చాకిచర్లలో బుక్ కీపింగ్ పాయింట్‌లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో నీతికథలు, మహనీయుల చరిత్రలు చదివించారు. ఆదివారం విద్యార్థులు లైబ్రరీలకు వచ్చి పుస్తకాలు చదవాలన్నారు. జనరల్ నాలెడ్జి తెలుసుకోవాలన్నారు.

26న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పల్లెల పుట్టారెడ్డి అన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎరువులు, విత్తనాలు సకాలంలో అందచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: రైతుల సమస్యలపై తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి..జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావును కోరారు. ఒంగోలులో ఆదివారం జరిగిన జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి రైతులకు సకాలంలో కంది విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని విన్నవించినట్లు తెలిపారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో వెలసిన అంకాళమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి స్వామి, అమ్మవారికి అభిషేకాలు చేశారు. కుంకుమ, పసుపు, పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి సమర్పించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు, అభికాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు



విశిష్ట అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి మూల విగ్రహమూర్తులు



భైరవకోనలో త్రిముఖదుర్గాదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రం భైరవకోనకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో భైరవకోనకు వచ్చారు. ఈసందర్భంగా జలపాతంవద్ద స్నానమాచరించి అనంతరం త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జ్ఞాన ప్రసన్నగిరి, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మండలంలోని పురాతన పుణ్యక్షేత్రం అయ్యలూరివారిపల్లె వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మలు వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూలలతో గోపూజ చేశారు. నారాయణస్వామి మూలవిగ్రహ మూర్తికి, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి గర్భాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహ బాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నకేశవుని కల్యాణోత్సవంలో మంత్రి



చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకుని వస్తున్న మంత్రి స్వామి



చెన్నకేశవుని కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం దావగూడూరు శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కల్యాణోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వయోవృద్ధులు, సచివాలయం, గ్రామ వలంటీర్ల శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈఓ రజనీకుమారి మంత్రి స్వామి, దామచర్ల సత్యకు పూర్ణ కుంభంతో అపూర్వ స్వాగతం పలికారు. మంత్రి స్వామి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను తీసుకుని వచ్చి చెన్నకేశవస్వామికి సమర్పించారు.

పోలేరమ్మ బ్రహ్మోత్సవాల్లో..

ప్రసిద్ధి చెందిన జరుగుమల్లి మండలం కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక తిరునాళ్లలో చివరిరోజు ఆదివారం మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పూజలు చేశారు. ఈఓ శివశంకర్ మంత్రి స్వామి, దామచర్ల సత్యకు పూర్ణ కుంభంతో సాదరంగా స్వాగతం పలికారు. మహిళలు పోలేరమ్మతల్లికి పాలపొంగళ్ల సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



కందుకూరు: శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



సీఎస్‌పురం: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కందుకూరు: ఏకాత్మత మానవతావాద సిద్ధాంత కర్త, జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించిన శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీని వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. జాతి ఐక్యత కోసం, దేశంలో సామరస్యత కోసం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో నేడు ప్రధాని నరేంద్రమోడీ దేశ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని వివరించారు. వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టి దేశ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోడీ పనిచేస్తున్నారని, దేశంలో అభివృద్ధిలో పరుగులు పెడుతుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జొన్నాదుల రాఘవయ్య, నియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు, పట్టణశాఖ అధ్యక్షుడు వరప్రసాదరావు, చుండి మురళీధర్, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, చిన్ని పాండురంగయ్య, బాలరాఘవులు, మువ్వల భూషయ్య, మాల కొండారెడ్డి, నవులూరి రాజేష్, ప్రసాద, జగన్నాథం వైకుంఠం, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తన్నీరు మల్లికార్జునరావు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మాటూరి రమేష్‌నాయుడు, మహిళా నాయకురాలు దార్ల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): బీజేపీ నాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు ఇండ్లా వెంకటసత్యం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి రమణయ్య, పలువురు మండల నాయకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే చట్టం అనే నినాదంతో దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన వ్యక్తి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని, ఆయన దేశానికి భారతీయ జనతా పార్టీకి చేసిన సేవలు ఎనలేనివన్నారు. మన్నేపల్లి మాల్యాద్రి, పాశం రామకృష్ణ, రెబ్బా రాయుడు, నాయకులు, పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవాలయంలో పోలేరమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలు, పూలమాలలు, నిమ్మకాయ దండలతో అలంకారం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు కుంకుమ బండ్లతో రంగులు చల్లుకుంటూ వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు, నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారికి అర్చన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

గంగమ్మ తల్లికి నెల పొంగళ్లు



గుండ్లసముద్రంలో గంగమ్మ అమ్మవారికి హారతులు ఇస్తున్న మహిళా భక్తులు

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముంద్రంలో వేంచేసిన వాకా వారి ఇలవేల్పుగా భావించే శ్రీ గంగమ్మతల్లికి భక్తులు ఆదివారం ఘనంగా నెలపొంగళ్లు పెట్టుకున్నారు. ఈ నెల 8 వ తేదీన వాకా అనే ఇంటిపేరు గలవారు రాజులు గా, ఇనుకొల్లు, మారెడ్డి, దేవరపల్లి అనే ఇంటి పేర్లుగలవారు ప్రతానులుగా ఉండి గ్రామస్తుల సహకారంతో వేడుకగా తిరునాళ్ల జరుపుకున్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో భక్తులు సంప్రదాయపు బొట్టుపెట్టించుకుని గ్రామదేవతైన గంగమ్మ అమ్మవారికి మహిళా భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా పూజారులు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రతిమలను, బొల్లావులను పసుపు, కుంకుమ, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ఎదరు ముగ్గువేసి బైనేటివాళ్లు కథ వినిపించిన అనంతరం పొంగళ్లను పలువురికి పంచిపెట్టారు. ఆడపడుచులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అమ్మవారిప్రతిమలు, బొల్లావులను తిరిగి గుడిలో ఉంచారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ

కందుకూరు: సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పట్టణ శివారు ప్రాంతాల్లో ఉండే నిరుపేదలకు ఐఎఫ్‌సీ ఫౌండేషన్ కార్యదర్శి షంషేర్ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాతల సహకారంతో నిరంతరం తమ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ప్రెసిడెంట్ సాజిద్, ట్రెజరర్ హఫీజ్, ఇన్‌చార్జి అయూబ్‌ఖాన్‌పఠాన్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఆహారం పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు



తక్షణ పారిశుధ్య పనులను చేయిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే సహించం

కనిగిరి రూరల్: పారిశుధ్య సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అలసత్వం వహించినా నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని 14వ వార్డు లాడే సాహెబ్ వీధిలో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికులు పారిశుధ్యం, మురుగునీటి కాలువ, నీరు, విద్యుత్ దీపాల సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. స్పందించిన చైర్మన్ గఫార్ తక్షణ చర్యగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. నీటి పారుదల ఆగిన డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయన్నారు. ఇంట్లో నుంచి వచ్చిన వ్యర్థాలను కాలువల్లో, రోడ్లపై వేయకుండా మున్సిపల్ చెత్త రిక్షాలో వేయాలని, లేదా మున్సిపల్ కార్మికుల చేతి అందచేయాలని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

26 నుంచి అచ్చమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు

పామూరు: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని రఘునాథపురం కమ్మవారిపాలెం లోని అచ్చమాంబ దేవస్థానంలో అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు 26వ తేదీ బుధవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అడుసుమల్లి నరసింహులు, చెంచయ్య పేర్కొన్నారు. 26వ తేదీన నిలుపు, పసుపు కుంకుమ, సారెకావెళ్లు, 27న గణపతిపూజ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం, 28న అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సవం, 29న కల్యాణోత్సవం, కుంకుమార్చన, పసుపు కుంకుమ, పెద్ద ఉత్సవం, 30న బండ్లు, పొంగళ్లు, రాష్ట్రస్థాయి ఎడ్లపందేలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి



తిరునాళ్లకు ముస్తాబవుతున్న అచ్చమాంబ ఆలయం

ప్రతి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించాలి

కందుకూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని, అధికారుల హాజరును ధ్రువీకరిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార ఫిర్యాదు వ్యవస్థ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని రకాల ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. ఫిర్యాదులను ప్రత్యేక ఐడీలతో నమోదుచేస్తామని, ఈ ఐడీల ద్వారా ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

గుడ్లూరు: మండలంలోని చెమిడిదిపాడు వద్ద ఆంజనేయ స్వామి గుడి వద్ద హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామిని పట్టు వస్త్రాలు, పూలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ కోటి హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞంలో భాగంగా 2022లో ఏకాదశి రోజున ప్రారంభమై నేటికి 108 ఆదివారాలు హనుమాన్ చాలీసా పారాయణం పూర్తయిందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయం వెనుక వైపు పంచముఖి ప్రసన్న ఆంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆలయ ట్రస్టు చైర్మన్ ఆలూరు హనుమంతురావు తెలిపారు.

వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు, మొదలగు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రమేష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.